# అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే డ్రా

- ఆర్వో సమక్షంలో సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల కౌంటింగ్
- మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహిస్తాం
- శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, నవంబరు 25 (నమస్తే తెలంగాణ ) : డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ డీఈవో అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో కౌంటింగ్ సూపర్ వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో అనుదీప్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ రోజున మొదటగా పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మేరకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు కేవలం కంట్రోల్ యూనిట్‌లను మాత్రమే లెక్కించాలని పేర్కొన్నారు.

సూపర్‌వైజర్లు కౌంటింగ్ సందర్భంగాఫారం-17సి, పార్ట్-1, ఫారం-20లను నమోదు చేయాలని అనుదీప్ సూచించారు. కౌంటింగ్ రోజు సిబ్బంది మొదటగా కంట్రోల్ యూనిట్‌ల సీలింగ్‌ను పరిశీలించారు. అనంతరం కంట్రోల్ యూనిట్ ఆన్‌బటన్‌ను క్లిక్ చేసి రిజల్ట్ బటన్ ద్వారా ఓట్ల లెక్కింపు అభ్యర్థుల వారీగా ఫారం-17సి, పార్ట్-2లో నమోదు చేయాలని తెలిపారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఏమైనా టెండర్ ఓట్లు నమోదు అయినచో వాటిని ప్రత్యేకంగా పరిశీలించి మొత్తం ఓట్ల నుంచి టెండర్ ఓట్లను తీసి వేసి లెక్కించాలని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో అబ్జర్వర్లు ర్యాండమ్‌గా ఐదు పోలింగ్ స్టేషన్ల కంట్రోల్ యూనిట్లను పరిశీలించి ట్యాలీ చేస్తారని అనుదీప్ చెప్పారు. కౌంటింగ్ సిబ్బంది ఫారం-17ఏలో నమోదైన ఓట్ల సంఖ్యను 17-సీ ద్వారా ట్యాలీ చేసుకోవాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన ఆనంతరం సంబంధిత అధికారులు ఫారంలో సంతకాలు చేసి రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని అనుదీప్ తెలిపారు. ఆనంతరం కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆఫ్ చేసి బాక్స్‌లలో అమర్చాలని తెలిపారు.

## ఏజెంట్లు 16 మందికి మించకుండా..

అభ్యర్థులకు సమాన ఓట్లు నమోదు అయినచో రిటర్నింగ్ అధికారి డ్రా ద్వారా అభ్యర్థిని ఎంపిక చేస్తారని డిప్యూటీ డీఈవో తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద కౌంటింగ్ ఏజెంట్లు 16 మందికి మించకుండా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి రౌండ్ తర్వాత అబ్జర్వర్లు రెండు కంట్రోల్ యూనిట్ల ఓట్లను క్రాస్ వెరిఫికేషన్ చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి కంట్రోల్ యూనిట్ ద్వారా నేరుగా శిక్షణ అందించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ మంగతాయారు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న భారతీ హోళీకేరి

## ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి భారతీ హోళీకేరీ**

మియాపూర్ , నవంబరు 25 : శేరిలింగంపల్లి వెంకటేశ్వర్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న నియోజకవర్గస్థాయి ఎన్నికల పోలింగ్ సిబ్బంది, సహాయ పోలింగ్ సిబ్బంది శిక్షణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతీ హోళీకేరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ఎన్నికల విధులను అత్యంత సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ, వేలికి సిరా చుక్క, ఓటరు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు పరిశీలించటం సహా ప్రక్రియను సమర్థంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి భారతీ హోళీకేరి సూచించారు.

## ఘనంగా రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేస్తామని ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కే సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఎన్ రెడ్డి, కో డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి, మెటీరియల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గుంటి రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఈవీ రంగంపై టీ హబ్‌లో శిక్షణ

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ మార్కెట్లోకి వస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలను విరివిగా వాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఈవీ పాలసీలను తీసుకువచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు శనివారం టీ హబ్ ప్రత్యేకంగా ఔత్సాహికులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంపును నిర్వహించింది. నిపుణులతో శిక్షణా తరగతులను నిర్వహించి, ఈవీ రంగంలో ఉన్న సవాళ్లను, అవకాశాలను ఏవిధంగా అందిపుచ్చుకోవచ్చో వివరించారు.

## అగర్వాల్ ఇండస్ట్రీ కొనసాగింపుపై వివరణ ఇవ్వండి

**ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు**

హైదరాబాద్ నవంబర్ 25, నమస్తే తెలంగాణ : ఆర్టీసీ క్రాస్ రోడ్ ప్రాంతమంతా నివాసయోగ్యంగా మారిపోయినప్పుడు అక్కడికి సమీపంలోని అజామాబాద్ పారిశ్రామికవాడలో అగర్వాల్ ఇండస్ట్రీని ఏ విధంగా కొనసాగిస్తున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు కోరింది. కౌంటరు దాఖలు చేయాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. చట్టప్రకారం నివాస ప్రాంతంలో పరిశ్రమ ఉండటం చెల్లదని గుర్తు చేసింది. విచారణను డిసెంబరు 14వ తేదీకి వాయిదా వేసింది. అజామాబాద్ పారిశ్రామికవాడలో 136 ఎకరాలను లీజుదారుల నుంచి ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోవడంపై సి. కుమార్ అనే వ్యక్తి హైకోర్టుకు 2017లో లేఖ రాశారు. దీనిని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ జె. అనిల్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. ఇప్పటికే పరిశ్రమలను మరోప్రాంతానికి తరలించినట్లు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చెప్పారు. ఔటరు రింగు రోడ్డు సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాకు తరలింపునకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. ప్రతివాదిగా ఉన్న అగర్వాల్ ఇండస్ట్రీస్ తరపు న్యాయవాది ఎన్. నవీన్ కుమార్ వాదిస్తూ ఇండస్ట్రీ ఇక్కడ నడుపుకోవచ్చన్నారు. దీంతో అగర్వాల్ ఇండస్ట్రీని నివాస ప్రాంతంలో అనుమతి ఇవ్వడం సరికాదని అభిప్రాయపడిన హైకోర్టు ప్రభుత్వ వివరణ కోసం విచారణ వాయిదా వేసింది.

## అదను చూసి చోరీలు..

**6 ల్యాప్‌టాప్‌లు. రూ.3 లక్షల సొత్తు స్వాధీనం..**

జూబ్లీహిల్స్, నవంబర్ 25: సీసీ టీవీ కెమెరా టెక్నిషియన్‌గా పనిచేస్తూ వస్తున్న ఆదాయంతో తృప్తి చెందక అక్రమ మార్గాలలో ధనార్జన చేసేందుకు ప్రార్థనా మందిరాలలో చోరీలకు పాల్పడుతున్న ప్రబుద్ధుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి పట్టుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఏవీఆర్ నరసింహారావు ఇందదుకకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మసీదులలో, ఆలయాలలో ప్రార్థనలు జరిగే సమయంలో ల్యాప్‌టాప్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ముసారం బాగ్‌కు చెందిన అబ్దుల్ నదీమ్‌ను పట్టుకుని 6 ల్యాప్‌టాప్‌లతో పాటు రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



కేసు వివరాలు వెల్లండిస్తున్న అడిషనల్ డిప్యూటీ కమిషనర్ నరసింహారావు

## ఘనంగా జాతీయ న్యాయ దినోత్సవం



బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూమ్ న్యాయ కళాశాలలో జరిగిన జాతీయ న్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

నాంపల్లి కోర్టులు, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉలూమ్ న్యాయ కళాశాలలో శనివారం జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి కోర్టుల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జిల్లా జడ్జి ప్రేమావతి, కార్యదర్శి కేవీ చంద్రశేఖర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, వాలింటీర్లు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## రూ. 58 కోట్ల నగదు స్వాధీనం

**కలెక్టర్ గౌతమ్ వెల్లడి**

మేడ్చల్, నవంబర్25(నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించిన తనిఖీలలో రూ. 58.48 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ శనివారం తెలిపారు. ఈ మేరకు 482 కేసులు అయినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నగదు తీసుకెళ్లిన వారి వద్ద నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న నగదులో రూ. 43 కోట్లను తిరిగి అప్పగించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రీవెన్స్ కమిటీ అధికారులు అన్ని రకాల ధృవపత్రాలు పరిశీలించి అన్ని రకాల ఆధారాలు పరిశీలించి 396 కేసులకు సంబంధించి రూ. 43 కోట్లను అప్పగించినట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న నగదును తిరిగి పొందేందుకు తగిన ఆధారాలతో కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ కమిటీని సంప్రందించాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అబ్కారీశాఖ ఆధ్వర్యంలో 2,17,073 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 1,114 కేసులు నమోదు చేసి 487 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

## హెచ్‌పీఎస్‌లో ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడలలో విజేతలకు బహుమతులను అందజేసిన జస్టిస్ సురేందర్‌మోహన్

రామంతాపూర్, నవంబర్ 25 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం 44వ క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ హైకోర్టు జస్టిస్ కే. సురేందర్ మోహన్ క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల క్రీడా విన్యాసాలు, యోగసనాలు, ఏరోబిక్ డ్యాన్స్‌లు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం జస్టిస్ సురేందర్‌మోహన్ మాట్లాడుతూ ఆటలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతాయన్నారు. తదనంతరం క్రీడలలో విజేతలకు సురేందర్‌మోహన్ పాఠశాల ప్రాచార్యులు సల్లారం నర్సింహారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 25 : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్సు సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్ సైడ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. డయాలసిస్ అసిస్టెంట్ కోర్సుకు కనీస అర్హత ఇంటర్మీడియట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సు కనీస అర్హత ఎనిమిదో తరగతి కాగా, మిగిలిన కోర్సుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. అనస్థీషియా టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ టెక్నీషియన్, పర్‌ఫ్యూజన్ టెక్నీషియన్, క్యాథ్‌ల్యాబ్ టెక్నీషియన్ తదితర విభాగాల్లో డిప్లొమా కోర్సులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వ స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.